# వారసత్వం



పురోహితులు ఋగ్వేదం చదువుతున్నారు.

బంధుమిత్రులందరూ వేదిక దగ్గర గుమికూడారు. శకుంతల మాత్రం దూరంగా కుర్చీలో కూర్చుని అక్కడ నుంచే చూడసాగింది.

ఆమె చిన్న ఆడపడుచు కొడుకు ఉపనయనం జరుగుతోంది.

'తనకు వయసు మీదపడుతోంది. మరో రెండేళ్లు పోతే తనకు అరవై నిండుతుంది. మునుపటిలా పెళ్ళిళ్ళకూ, ఫంక్షన్స్‌కూ వచ్చి ఉత్సాహంగా తిరిగే శక్తి తగ్గిపోతోంది' అనుకొంది శకుంతల. ఈమధ్య కొంతసేపు ఒకచోట కూర్చుంటే కాళ్లు పట్టేసి లేవలేకపోతోంది ఆమె.

ఉపనయనం పూర్తయింది. అందరూ టిఫిన్లు తినడానికి డైనింగ్ హాలువైపు వెళ్తున్నారు. వాచ్‌లో టైం చూసింది. ఎనిమిది కావస్తోంది. ఆమెకీ ఆకలి వేస్తోంది. తనూ డైనింగ్ హాలుకు వెళదామంటే లేచి నిలబడలేకపోతోంది.

ఆమెకి సమీపంలో కొంతమంది కుర్రాళ్ళు నిలబడి మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ సహాయం కోరదామని అనుకుంటే ఒక్కరూ ఆమెవైపు చూడటం లేదు. వాళ్ళేంటో.., వాళ్ళ మాటలేంటో.., వాళ్ళ నవ్వులేంటో..! 'ఆ కుర్రాళ్ళలో చాలామంది తనకు బంధువులే. మొన్నటివరకూ "అత్తా..." అంటూ తన వెనక తిరిగినవాళ్ళే. ఈరోజు కాస్త వయసొచ్చేసరికి తన గురించి పట్టించుకునే అవసరం, ఓపిక వాళ్ళకు లేదు' అనుకొంది.

ఆమెకి రామకృష్ణ గుర్తొచ్చాడు...

అతను ఆమెకి దూరపుబంధువు. 'రామకృష్ణ ఏ పంక్షన్‌కి వచ్చినా అందరితో మాట్లాడతాడు. అందరి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటాడు. పెద్దవాళ్ళలో పెద్దగా, చిన్నవాళ్ళలో చిన్నగా బాగా కలసిపోతాడు. ముఖ్యంగా తనంటే ఎంతో ఇష్టం అతనికి. అతని భార్య రెండు పురుళ్ళకూ తను దగ్గరుండి సహాయం చేసింది. ఆ కృతజ్ఞత అతనికి ఈరోజూ ఉంది. ఇలా ఫంక్షన్స్‌లో కలిస్తే తన చెయ్యి పట్టుకొని భోజనశాలకు తీసుకెళ్లడం, తను ఇంటికి బయలుదేరితే ఆటో పిలుచుకురావడం వంటి పనులన్నీ చేసేవాడు. ఈ ఫంక్షన్‌కి ఎందుకో రామకృష్ణ రాలేదు. అతను మదనపల్లిలో ఉన్నా, తిరుపతిలో జరిగే బంధువుల ఫంక్షన్‌ల కన్నిటికీ తప్పనిసరిగా హాజరయ్యేవాడు. చాలాసార్లు భార్యను కూడా పిలుచుకొని వచ్చినా, ఆమెకి వీలులేకుంటే తను మాత్రం తప్పకుండా వచ్చేవాడు. రామకృష్ణ లేని లోటు ఈరోజు తెలుస్తోంది తనకి!' అనుకొంది శకుంతల.

ఇంతలో... ఆమె దృష్టి లోపలికి వస్తున్న యువకుడిపై పడింది.

ఇరవయ్యేళ్లుంటాయి అతనికి. అతను లోపలికి రాగానే కుర్రాళ్ళందరూ అతని వైపు నడిచారు. అతను నవ్వుతూ, అందరినీ పలకరిస్తూ, చేతులు కలుపుతూ మాట్లాడుతున్నాడు. 'అతన్ని ఎక్కడో చూసింది. కాని, ఎవరో గుర్తుకురావడం లేదు...' అనుకొంది శకుంతల.

కొంతసేపటి తర్వాత ఆ అబ్బాయి శకుంతల దగ్గరికి వచ్చి-

"బాగున్నారా అత్తా!" అన్నాడు.

"బాగున్నాను నాయనా! ఇప్పుడేనా రావడం?" అంది- 'నీవెవరు నాయనా?' అని అడిగితే నొచ్చుకుంటాడని.

"అవునత్తా! మొదటి బస్సు మిస్సయ్యాను. అందువల్ల ఆలస్యం అయ్యింది."

"అమ్మా, నాన్నా రాలేదా?"

"అమ్మకి జ్వరం! నాన్న అమ్మకి తోడుగా ఉండి నన్ను పంపారు."

అతను వెళ్లిపోయాడు.

అందరూ టిఫిన్ తినడానికి వెళ్లారు. తన గురించి పట్టించుకునేవాళ్ళే లేకపోవడంతో ఆమె కంట్లో నీరు తిరిగింది. ఒకరిద్దరు వచ్చి టిఫిన్‌కి రమ్మని పిలిచి వెళ్లిపోయారు. నిలబడి ఆమె సమస్య ఏమిటో తెలుసుకోలేదు.

ఆ అబ్బాయి మళ్లీ వచ్చాడు.

"మీరు టిఫిన్ తినలేదా అత్తా?" అని అడిగాడు.

ఇక సిగ్గుపడి లాభంలేదని అతనితో తను లేవలేనని, మరోమనిషి ఆసరా అవసరమని చెప్పింది.

"మరి, ఆ మాట ఇందాకే చెప్పవచ్చుగా అత్తా! తొమ్మిదవుతోంది. ఆకలిగా లేదూ?!" అంటూ ఆమె చెయ్యి పట్టుకొని లేపి డైనింగ్ హాలుకి తీసుకెళ్లాడు.

ఆమె కుర్చీలో కూర్చుని, "నువ్వూ తిను నాయనా! ఇక నేను నడవగలను" అంది ఆప్యాయంగా అతన్ని చూస్తూ.

"నేను తినడం అయింది... మీరు కానివ్వండి!" అని వెళ్లిపోయాడు. పది నిమిషాల తర్వాత వచ్చి ఆమె తినడం పూర్తయ్యాక చేయి పట్టుకొని హాల్లోకి పిలుచుకువచ్చి కూర్చోబెట్టాడు... ఆమె వద్దన్నా వినకుండా.

"చాలా సహాయం చేశావు నాయనా! నువ్వు ఎవరో గుర్తుతెచ్చుకోలేక పోతున్నాను. ఏమనుకోకు. ఎవరి బిడ్డవు నీవు?" అని అడిగింది.

"ఫర్వాలేదు. నేను గత అయిదేళ్లుగా చెన్నైలో చదువుకుంటున్నాను. కనుక మీరు ఈమధ్య నన్ను చూసి ఉండరు. చిన్నప్పట్నుంచీ మిమ్మల్ని చూస్తున్నాను కనుక, మీలో పెద్ద మార్పు లేదు కనుక నేను తేలికగానే మిమ్మల్ని గుర్తుపట్టాను. మదనపల్లిలో ఉంటున్న రామకృష్ణ మీకు తెలుసుగా! వారి అబ్బాయిని నేను!" అన్నాడు అతను.

ఒక్కసారిగా శకుంతల ముఖం విప్పారింది ఆనందంతో.

"రామకృష్ణ బిడ్డవా నువ్వు? నీ పేరు ముకుందం కదూ? బాగా పొడుగు పెరిగావు కాబట్టి గుర్తుపట్టలేకపోయాను. చాలా సంతోషం నాయనా! ఏంచేస్తున్నావు నువ్వు?"

"ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్నాను" అని ఆమె భర్త గురించి, పిల్లల గురించి అడిగి తెలుసుకున్నాడు.

అతను వెళ్లిపోయాక, 'ఆ తండ్రి బిడ్డ కాబట్టే ఆ సుగుణాలు వచ్చాయి ఈ అబ్బాయికి కూడా. పెద్దలంటే గౌరవం, ఇతరుల గురించి పట్టించుకునే ఓపిక, సహాయం చేసే గుణం తండ్రి నుంచి పుణికిపుచ్చుకొన్నాడు. తల్లిదండ్రులు ఎలా ప్రవర్తిస్తే పిల్లలూ అలాగే ప్రవర్తిస్తారు. పిల్లల ప్రవర్తన బాగుండాలంటే తల్లిదండ్రులు తమ ప్రవర్తన గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది' అనుకొంది శకుంతల.